భక్తజన సందడి

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మతల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సమీప గ్రామాలతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు సమర్పించారు. అన్నప్రాశన, వాహన పూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం వంటి కార్యక్రమాలు అర్చకులు జరిపించారు. ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దేవాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అట్టహాసంగా రామయ్యకు అభిషేకం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు సాగాయి. అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించి అభిషేక మహోత్సవం నిర్వహించారు. బంగారు పుష్పార్చన అలరించింది. భద్రాద్రి దర్శనం పరమ పావనమని సుభాషించారు. విష్వక్సేనుల వారిని ఆరాధించి పుణ్యాహవాచనం చేశారు. గోత్రనామాలను చదివారు. కల్యాణ క్రతువు గురించి వివరిస్తూ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. పలువురు ప్రముఖులు వచ్చి ప్రధాన కోవెలలో మూలవిరాట్‌తో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వచనం పొందారు. సోమవారం ముత్తంగి రూప దర్శనం ఉంటుంది.

పర్ణశాలలో సంప్రోక్షణ

దుమ్ముగూడెం: పర్ణశాల రామాలయంలో ఆదివారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత ఆలయ ఉద్యోగి శ్రీరామమూర్తి(70) గ్రామంలో మృతి చెందడంతో రామాలయం ఆచార సంప్రదాయం ప్రకారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు తలుపులు మూసివేశారు. సంప్రోక్షణ కార్యక్రమం పూర్తయిన అనంతరం సాయంత్రం సమయంలో ఆలయ తలుపులు తెరిచి స్వామివారి దర్శనం భక్తులకు కల్పించారు.

ఈ సారీ నిర్లక్ష్యం చేస్తే.. బియ్యం బంద్

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం,
న్యూస్‌టుడే ఖమ్మం, కలెక్టరేట్

పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. తరచూ క్వింటాళ్ల కొద్దీ బస్తాలు, లారీల కొద్దీ లోడ్లు పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలో అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు, అర్హులకే బియ్యం అందేలా చూసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే రేషన్ కార్డులకు 'ఈ కేవైసీ (ఎలెక్ట్రానిక్- నో యువర్ కస్టమర్)'ని తప్పనిసరి చేసింది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకే రేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏదైనా కుటుంబంలో ఒక లబ్ధిదారు ఈ కేవైసీ ప్రక్రియ చేయించకుంటే, వారి పేర్లను కార్డులోంచి తొలగించనున్నారు. ఇందుకోసం విధించిన గడువును ప్రభుత్వం తాజాగా మళ్లీ పొడిగించింది. నెలాఖరుతో ముగియనున్న తేదీని డిసెంబరు 31 వరకు పెంచింది. మరోసారి ఈ అవకాశం ఉండబోదని, నిర్లక్ష్యం చేసిన లబ్ధిదారులు ఆ తర్వాత రేషన్ పొందలేరని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

● ఇంకా ఈకేవైసీ చేయని లబ్ధిదారులు 4.4 లక్షల మంది

భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం

రేషన్ కార్డులు	లబ్ధిదారుల సంఖ్య
2,93,282	8,00,000
4,11,250	12,00,000
ఈ-కేవైసీ పూర్తయినవారు..	6,00,000 9,60,000

గడువు పెంచుతారని..

ఈ కేవైసీ నమోదు కార్యక్రమం గత భారాస ప్రభుత్వ హయంలో మొదలైంది. ఇప్పటికీ ఈ ప్రక్రియ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వంద శాతం పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు. కేవలం మూడోవంతు మంది మాత్రమే ప్రక్రియ పూర్తిచేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ ప్రక్రియ 80 శాతం పూర్తికావచ్చింది. భద్రాద్రి జిల్లాలో 2 లక్షలు, ఖమ్మం జిల్లాలో మరో 2.4 లక్షల మంది ఇంకా ఈకేవైసీకి నోచుకోలేదు. ప్రభుత్వం గడువు పొడిగిస్తుందనో, ఇతర కారణాలతోనే చాలామంది లబ్ధిదారులు ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేశారు.

ఎందుకింత జాప్యం?

- ఎక్కువ మందికి ఆధార్ నవీకరణ, బయోమెట్రిక్ వంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.
- గత పదేళ్లలో చాలామంది చనిపోయారు. వారి వివరాలు అప్‌డేట్ చేయలేదు.
- యువతులు వివాహాలు చేసుకుని వెళ్లిపోయారు. కొత్త కాపురాలు పెట్టిన వారికి కార్డులే మంజూరు కాలేదు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వంటి మన్యం ప్రాంతంలో లబ్ధిదారుల్లో కొందరికి అవగాహన కొరవడి జాప్యమవుతోంది.
- ఇదే క్రమంలో లబ్ధిదారుల పేరుతో కొందరు డీలర్లు రేషన్ నిల్వలు పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలున్నాయి.
- క్షేత్రస్థాయిలో పలు సమస్యలున్నప్పటికీ, కొత్త కార్డుల్లేకున్నా రేషన్ బియ్యం పంపిణీ ఆహార భద్రత (ఎఫ్ఎన్‌సీ) కార్డుల ఆధారంగా యథావిధిగా కొనసాగుతోంది.

ప్రభుత్వ పథకాలు పొందేందుకూ ఇబ్బందే..

రుక్మిణీదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

'ప్రభుత్వం ఈకేవైసీకి ఈ ఏడాది చివరి వరకు ఇచ్చింది. ప్రతి ఒక్క లబ్ధిదారుడు తమ రేషన్ దుకాణ డీలరును సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలి. ఆధార్‌కు సంబంధించి సమస్యలుంటే ముందే పరిష్కరించుకోవాలి. ఈ సారీ గడువు మీరే వరకు నిర్లక్ష్యం చేస్తే మాత్రం.. బియ్యంతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించే విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయి.'

రాతపరీక్షకు 161 మంది హాజరు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో ఖాళీగా ఉన్న 25 అసిస్టెంట్ ఫోర్మన్ ట్రైనీ ఎలక్ట్రికల్ పోస్టులను అంతర్గత నియామకాలతో భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాతపరీక్షను నిర్వహించారు. మొత్తం 161 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జీఎంలు శామ్యూల్ సుధాకర్, ప్రసాదరావు, డీజీఎం వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ చింతా శారద పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. సోమవారం తెల్లవారేలోపుగా సింగరేణి వెబ్‌సైట్‌లో, ప్రధాన కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ఫలితాలను ప్రకటించనున్నారు.

పరీక్షను పర్యవేక్షిస్తున్న జీఎం శామ్యూల్ సుధాకర్

ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు నైపుణ్య శిక్షణ ఇప్పించాలి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు, టెక్నీషియన్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జడల అంజయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఉర్దూమర్‌లో సంఘం ప్రధాన కార్యదర్శి యు.కుమార్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రీషియన్లకు 'న్యాక్' సంస్థ ద్వారా నైపుణ్య శిక్షణ ఇప్పించాలని నాయకులు కోరారు. ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.10 లక్షల పరిహారం, పింఛను సౌకర్యం కల్పించాలని, ధరల రేట్ల పట్టిక నిర్ణయించాలని కోరారు. త్వరలో కొత్తగూడెంలో జిల్లా మహా సభలను ఏర్పాటు చేయనున్నట్లు అంజయ్య తెలిపారు. గౌరవ అతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీం ఖురేషి హాజరయ్యారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ షరీఫుద్దీన్, న్యాక్ ఇన్‌స్ట్రక్టర్ హెచ్పీబా, సంఘం భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు ఎండీ షరీఫ్, బాలరాజు, రఘురాం, షేక్ హసీం, సమద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న నయీం ఖురేషి, జడల అంజయ్య, నాయకులు

కిన్నెరసానిలో పర్యాటకుల కళ

కిన్నెరసాని రిజర్వాయర్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. 500 మంది సందర్శకులు తరలివచ్చి ప్రకృతి అందాల్ని ఆస్వాదించారు. దుప్పుల పార్కు, బాతుల కొలను వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. అనంతరం జలాశయంలో బోటుపై ఉత్సాహంగా షికారు చేశారు. టోల్ గేటు ఆదాయం రూ.14,470 రాగా, బోటు ఆదాయం రూ.7,350 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. – పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

దీపావళి బోనస్ @ రూ.93,750

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

బొగ్గు గని కార్మికులకు దీపావళి నజరానాగా అందించనున్న మొత్తం ఎంతో ఖరారైంది. పనితీరు మదింపు ఆధారంగా (పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్) ఏటా పండుగకు కోలిండియా, సింగరేణి సంస్థలు బోనస్ ఇస్తున్న తెలిసిందే. ఈ ఏడాది మొత్తాన్ని యాజమాన్యాలు ఆదివారం నిర్ణయించాయి. ఈ విషయమై జాతీయ కార్మిక సంఘాలతో దిల్లీలో సమావేశమైనట్లు కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయ అధికారులు వెల్లడించారు. గత సంవత్సరం రూ.85,500 చెల్లించిన బోనస్‌కు అదనంగా ఈ ఏడాది మరో రూ.8,250 పెంచారు. మొత్తం రూ.93,750 వేలుగా బోనస్ నిర్ణయించారు. దేశవ్యాప్తంగా కోలిండియాలో పనిచేస్తున్న 2.5 కోట్ల మందితో పాటు సింగరేణిలోని 42 వేల మంది కార్మికులకు ఈ నిర్ణయంతో ఊరట దక్కింది. పీఎల్ఆర్ బోనస్‌ను దీపావళి లోగా అందజేయనున్నట్లు ప్రధాన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

కార్మిక సంఘాల పట్టు..

గతేడాది బొగ్గు పరిశ్రమల్లోని ఉద్యోగులకు రూ.85,500 మొత్తాన్ని పీఎల్ఆర్ బోనస్‌గా చెల్లించారు. ఈ ఏడాది అదనంగా మరో రూ.లక్ష చెల్లించాలని జాతీయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంస్థలు లాభాల్లో ఉన్నందున తమ డిమాండ్ సరైనదేనని చర్చల్లో రాత్రి పొద్దుపోయే దాకా పట్టుబట్టారు. పలు దఫాలుగా కొనసాగిన జరిగిన చర్చల అనంతరం సుమారు రూ.8 వేలు అదనంగా పెంచేందుకు యాజమాన్యాలు మొగ్గుచూపాయి. సంఘాలకు ఎలాగోలా సర్దిచెప్పాయి. ఈ మొత్తాన్ని సింగరేణిలో దీపావళికి ముందు, కోలిండియాలో దసరాకు ముందు చెల్లిస్తారు. ఆయా తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

లబ్ధపొందనున్న కార్మికులు వివరాలు ఇలా..

కార్పొరేట్ కార్యాలయం: 1,630	ఇల్లెందు ఏరియా: 668
కొత్తగూడెం ఏరియా: 2,622	మణుగూరు ఏరియా: 2,547





నేడు ప్రజావాణి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 10.30 గంటల వరకు కలెక్టరేట్‌లో ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రజలు వారి సమస్యలను లిఖితపూర్వకంగా నేరుగా అందజేయాలని సూచించారు.

విద్యుత్ శాఖలో...

విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ(టెక్నికల్) వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వారి పరిధిలోని విద్యుత్ సంస్థ అధికారులను కలిసి నేరుగా కలిసి కానీ, లేదా టీజీ-ఎన్‌పీడీసీఎల్ సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో కానీ సమస్యలు నివేదించవచ్చని అన్నారు.

(c) eenadu

మాట్లాడుతున్న సీసీఎఫ్ డి.బీమానాయక్

కొత్తగూడెం, భద్రాచలం కబడ్డీ మ్యాచ్

క్రీడలతో మానసికోల్లాసం: సీసీఎఫ్

☆ కొత్తగూడెంలో జోనల్ స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్-2024 ప్రారంభం

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: మానసిక ఉల్లాసం, స్నేహపూర్వక వాతావరణానికి క్రీడలు ఉపయోగపడతాయని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.బీమానాయక్ అన్నారు. కొత్తగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన భద్రాద్రి జోనల్ స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్-24కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జోనల్‌లోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఉన్నత స్థాయి నుంచి కింది స్థాయి అటవీ ఉద్యోగులు ఇలా ఒక్క చోట చేరి క్రీడల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా అటవీశాఖాధికారి కిష్టాగౌడ్ మాట్లాడుతూ నిత్యం ప్రకృతితో మమేకమై విధులు నిర్వహించే అటవీ ఉద్యోగులకు ఈ క్రీడలు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో ఐదు జిల్లాలకు చెందిన 534 మంది క్రీడాకారులు పాల్గొనగా మొదటి రోజు వాలీబాల్, రన్నింగ్, షెటిల్, షాట్ పుట్ తదితర క్రీడలను నిర్వహించారు. ఖమ్మం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ డీఎఫ్‌వోలు సిద్ధార్థ విక్రమ్‌సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అంజు అగర్వాల్, వరంగల్, పాల్వంచ డీసీఎఫ్‌లు కృష్ణమాచార్య, దామోదర్ రెడ్డి, భద్రాచలం, మణుగూరు, వైల్డ్‌లైఫ్ కన్జర్వేసాని, గూడురు, సత్తుపల్లి, కొత్తగూడెం ఏసీఎఫ్‌లు సుజాత, మొహియుద్దీన్, బాబు, చంద్రశేఖర్, మంజుల, కోటేశ్వరరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి పాఠశాల క్రీడలు ఆదివారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్స్, పుట్‌బాల్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ అంశాలకు పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్ అంశంలో కూసుమంచి, మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నార్త్, సౌత్ ఒక్కో జోన్ నుంచి 60 మంది చొప్పున 360 మంది బాలబాలికలు పాల్గొన్నారు. పుట్‌బాల్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ అండర్ 14, 17 బాల బాలికలకు ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను సిద్ధం చేశారు. కార్యదర్శి నర్సింహమూర్తి, అథ్లెటిక్స్ శిక్షకుడు గౌస్, సంఘం సభ్యులు, జిల్లా పుట్‌బాల్, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్ సంఘాల సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు తోడ్పాటు అందించారు. తొలి రోజు జరిగిన పోటీల్లో ప్రభుత్వ గురుకులాలకు చెందిన బాల, బాలికలు రాణించారు.

లాంగ్ జంప్ చేస్తున్న బాలుడు

అవతార దర్శనం..

భద్రాచలంలో 4 నుంచి దసరా ఉత్సవాలు

తెలుగువారి ప్రధాన పండగల్లో విజయదశమి ముఖ్యమైంది. ఏటా దసరా వేడుకలు ఘనంగా జరుపుకొంటారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. అక్టోబరు 4వ తేదీ నుంచి దశమి వేడుకలు మొదలవుతాయి. అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తారు. సంబంధిత ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి రమాదేవి పర్యవేక్షిస్తున్నారు. ఈసారి గోత్రనామాల పూజతోపాటు, దసరా రోజు పట్టాభిషేకం చేయించే అవకాశం కల్పించారు. ఉత్సవాల్లో రామాయణ పారాయణం కొనసాగనుంది. 12న శ్రీరామలీల, రావణ వధ ఘట్టం, శమీపూజ ప్రత్యేకంగా నిలవనున్నాయి.

– భద్రాచలం, న్యూస్‌టుడే

ఆదిలక్ష్మీ పాలయమాం

అక్టోబరు నాలుగున అమ్మవారు ఆదిలక్ష్మి అవతారంలో దర్శనమిస్తారు. లక్ష్మ అంటే గుర్తు అని అర్థం. భగవంతుణ్ని గుర్తించడానికి ప్రధాన లక్షణమైన అమ్మకు లక్ష్మీ అని పేరు. భగవద్ తత్వాన్ని లక్ష్మీ అమ్మతోనే గుర్తించగలగడంతో అమ్మకు లక్ష్మీ అని పేరు సార్థకమైంది.

విజయలక్ష్మి దేవి

విజయలక్ష్మీ రూపంలో అమ్మవారి దర్శనం ఉంటుంది. జ్ఞానేశ్వరీ విజయప్రదా అని కీర్తిస్తారు. విజయం అంటే కేవలం యుద్ధ విజయం మాత్రమే కాదు. అన్ని రంగాల్లో విజయాన్ని ప్రసాదిస్తుందని అర్థం. ఆయా రంగాల్లోని విజయులను చేస్తుందనే విశ్వాసం ఉంది.

ధాన్యలక్ష్మి అవతారం

ధాన్యలక్ష్మీ అవతారం 8న ఉంటుంది. ధనధాన్య కరీం సిద్ధిం అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది అమ్మే. ఈ రూపంలో ఆరాధిస్తే బాధలు తొలగుతాయని భక్తులు నమ్ముతారు. వానలు కురిసి సస్య శ్యామలం అవుతుందని దని విశ్వాసం.

హే సంతానలక్ష్మి

అమ్మ సంతానలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. సకల చరాచర జగత్తు అంతా ఆ అమ్మ సంతానమే. అందుకే ఈ అమ్మకు సంతానలక్ష్మి అని పేరు. ఈ రూపంలో ఆరాధిస్తే అవరోధాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.

గజలక్ష్మీ కరుణించు!

గజలక్ష్మీ అవతారం ఉంటుంది. ఈ రూపంలో ఆరాధిస్తే మహా సంపద కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. అవతారంలో ఆరాధించే దేవేంద్రుడు త్రైలోక్యాధిపత్యాన్ని సాధించి నట్లు పురాణంలో ఉంది.

ధనలక్ష్మీ కటాక్షం

ధనలక్ష్మీ అమ్మవారి దర్శనం ఉంటుంది. ధనమూల మిదం జగత్ అంటారు. ధనం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు. విద్య, బలం, కీర్తి వంటివన్నీ ధనమే. విద్యా ధనం, హిరణ్య ధనం, శక్తి ధనం. ఈ మూడు విధాలైన ధనాన్ని ప్రసాదించే అమ్మకు ధనలక్ష్మీ అని పేరు.

ఐశ్వర్యలక్ష్మి 10

ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మ. ఈ రూపంలో అమ్మను ఆరాధిస్తే శాసకత్వం, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని శాస్త్రం.

వీరలక్ష్మి 11

ఈ అమ్మ మన దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారదోలే వీరత్వం గల అమ్మ. త్రిమూర్తులకు సైతం సాధ్యంకాని మహిషాసురుని, ముగ్గురమ్మల శక్తి స్వరూపమైన వీరలక్ష్మిగా ఆవిర్భవించి సంహరించింది.

మహాలక్ష్మి 12

ధనం, ధాన్యం, సంతానం, విద్య, అధికారం, వీరం, విజయం, ఐశ్వర్యం.. ఇలా మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించడానికి అష్టలక్ష్మి రూపాలను ధరించిన అమ్మ కరుణా స్వరూపమైన తన నిజరూపంలో అందర్నీ అనుగ్రహిస్తుంది.

ఆధ్యాత్మిక శోభితం

శునకాల సంతతి ఆగాలి గనక!

ఖమ్మం నగరపాలకంలో కుక్కల బెడద నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. వార్డుల్లో సంచరించే శునకాలను అసోం నుంచి రప్పించిన బృందాలతో పట్టించి.. అనంతరం రోటరీనగర్‌లోని సంరక్షణ కేంద్రంలో సంతతి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. ఆపరేషన్ల అనంతరం కుక్కల సంరక్షణకు అక్కడి కేంద్రంలో నగరపాలక అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- ఈనాడు, ఖమ్మం

పాతాళ గంగ.. ఉబికి దూకంగా..!

చర్ల మండల పరిధిలోని జంగాలపల్లి గుట్ట దారిలోని పల్లె ప్రకృతి వనంలో వేసిన బోరు నుంచి జలం ఇలా ఉబికి వస్తోంది. పలువురు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు. చెంతనే తాలిపేరు ఉండటంతో నది పరీవాహక నీటి మట్టం.. బోరు స్థాయికి సమానంగా ఉండటంతో ఇలా నీరు ఉబికి వస్తోందని గ్రామీణ తాగునీటి విభాగం ఏఈ రాము తెలిపారు. గుట్ట నుంచి వచ్చే జలం సైతం దీనికి తోడై ఇలా నీరు వస్తోందన్నారు.

- చర్ల, న్యూస్‌టుడే

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

కొణిజర్ల, న్యూస్‌టుడే: నీటితొట్టెలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన కొణిజర్లలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతల వెంకటకృష్ణ, సమతలకు తరుణ్‌సాగర్, 13 నెలలు ఉన్న మనస్విక సంతానం. సాయంత్రం సమయంలో ఇంట్లో వాళ్లు భోజనం చేస్తుండగా వారితో అంతసేపు సందడి చేసిన పాప ఆడుకుంటూ ఇంటి బయటకు వచ్చింది. ఆడుకుంటూ ఇంటి ఆవరణలో నీటి అవసరాల కోసం ఒకవరతో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో పడింది. భోజనం పూర్తయిన తర్వాత బయటకు వచ్చి చూసిన కుటుంబ సభ్యులకు పాప కనపడకపోవడంతో అల్లాడిపోయారు. తీరా నీటితొట్టెలో ఉండటంతో బయటకు తీసి పరుగున స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మనస్విక

చెడు ప్రచారం చేస్తున్నాడనే కోపంతో దివ్యాంగుడి హత్య

కామేపల్లి, న్యూస్‌టుడే: గోవింద్రాలలో దివ్యాంగుడి హత్యకేసులో ఇద్దరు నిందితులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతలింగాల స్టేజీ వద్ద ఎస్సై సాయికుమార్‌తో కలసి ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా, గోవింద్రాల వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఆ గ్రామానికి చెందిన సభావత్ మల్సూర్, లకావత్ సుమన్‌లు పట్టుబడ్డారు. వారిని తనిఖీ చేయగా దుస్తులపై రక్తపు మరకలు కనిపించాయి. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ నెల 26న రాత్రి గ్రామానికి చెందిన ఆలోతు భావ్‌సింగ్‌ను హతమార్చింది తామేనని ఒప్పుకొన్నారు. 'ఇంట్లోని వ్యక్తులను బాగా చూసుకోవడం చేతగాదు. కానీ, ఇతర మహిళలతో చెడు సంబంధాలు కొనసాగిస్తున్నారు' అని తమపై చెడుగా ప్రచారం చేయడం వల్లే ఇలా చేశామని అన్నారు. ఐదు రోజుల క్రితం గ్రామం సమీపంలో భావ్‌సింగ్‌కు బాగా మద్యం తాగించామని, తర్వాత రాయి, కర్రతో కొట్టి హత్య చేశామని చెప్పారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, హత్యకు పాల్పడిన నిందితులను ఖమ్మం న్యాయస్థానంలో హాజరుపర్చామని సీఐ తెలిపారు.

తల్లి హత్యోదంతంలో అరెస్టై.. అంత్యక్రియలకు హాజరై..

బోనకల్లు, న్యూస్‌టుడే: తల్లిని హత్య చేసిన కేసులో అతను నిందితుడు. దీంతో పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఒక్కడే కొడుకు కావటంతో అతని చేతుల మీదుగా అంత్యక్రియలు నిర్వర్తించేందుకు అనుమతించాలని స్థానికులు అభ్యర్థించారు. ఎట్టకేలకు పోలీసు కాపలా నడుమ మాతృమూర్తి అంత్యక్రియలు పూర్తిచేసి తిరిగి కటకటాలపాలయ్యాడు.

బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రాత్రి తాటి కొండ పాపయ్య అనే వ్యక్తి మద్యం మత్తులో తన తల్లి మార్తమ్మను హత్య చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పాపయ్యను అరెస్టు చేశారు. ఆదివారం అతని చేతుల మీదుగా తల్లి అంత్యక్రియలు పూర్తి చేయించి తిరిగి అదుపులో తీసుకున్నారు. తల్లి హత్యోదంతంలో అరెస్టై, ఆమె అంత్యక్రియలకు హాజరై, తిరిగి స్టేషన్‌కు చేరిన ఘటనలను స్థానికులు ఆశ్చర్యంగా చూశారు.

ఐఈడీ పేలి ఐదుగురు జవాన్లకు గాయాలు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఐఈడీ(ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) పేలి ఐదుగురు జవాన్లకు గాయాలయ్యాయి. జిల్లాలోని ఊసూరు బ్లాక్‌లోని తర్రెం-గుండం ప్రాంతంలో ఆదివారం ఉదయం సీఆర్‌పీఎఫ్ జవాన్ల బృందం తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీపై కాలువేయడంతో అది పేలి ఐదుగురు జవాన్లకు గాయాలయ్యాయి. తర్రెం పోలీసుస్టేషన్ పరిధిలోని చిన్న గెల్లూరు బేస్ క్యాంపు నుంచి భద్రతాబలగాల బృందం ఆర్‌వోపీ చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన జవాన్లకు ప్రాథమిక చికిత్సలు అందించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనను ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు.

గాయపడిన జవాన్లు

ఖమ్మం సర్వజనాసుపత్రిలో వాస్క్యులర్ కేంద్రం

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రిలో వాస్క్యులర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూత్రపిండాల వ్యాధిగ్రస్థుల కోసం రాష్ట్రంలో రెండు జిల్లాల్లో ఈ తరహా కేంద్రాలను నెలకొల్పేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఖమ్మం ఆస్పత్రి కూడా ఉండటంతో డయాలసిస్ రోగులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రిలో ప్రస్తుతం 22 పడకలతో కూడిన డయాలసిస్ కేంద్రం ఉంది. వాస్క్యులర్ కేంద్రం ఏర్పాటు నేపథ్యంలో రక్తశుద్ధి యంత్రాల సంఖ్య మరింత పెరగనుంది. డయాలసిస్ సందర్భంలో వాస్క్యులర్ కేంద్రం కీలకం. రక్తశుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు డయాలసిస్ యాక్సస్ పాయింట్ ఏర్పాటుకు వాస్క్యులర్ సర్జరీ చేస్తారు. ఇది రక్త ప్రవాహాన్ని నివారించడానికి ఉపయోగపడుతుంది. చికిత్స సమయంలో ద్రవం తొలగింపు, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌లో మార్పులకు ప్రతిస్పందనగా సర్దుబాటు చేస్తుంది. ఈ సర్జరీ కోసం రోగులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడే కేంద్రం ఏర్పాటైతే రానున్న కాలంలో బాధితులకు ఊరట లభిస్తుంది.

కవి రమేశ్‌కు 'అక్కినేని' బహుమతి

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, యువ కళావాహిని, సాహితీ కిరణం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకల్లో భాగంగా ఇటీవల రాష్ట్ర స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఖమ్మానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి కటుకోర్ముల రమేశ్ రాసిన 'స్థిత ప్రజ్ఞుడు' కవితకు ప్రథమ బహుమతి దక్కింది. హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశంలో ఆదివారం జరిగిన అక్కినేని కవిత-2024 కార్యక్రమంలో ఏపీ శాసన సభ్యుడు కె.రఘురామ కృష్ణంరాజు, అక్కినేని నాటక పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు చేతుల మీదుగా రమేశ్ బహుమతిని అందుకున్నారు. అనంతరం అతిథులు, ప్రముఖ సాహితీవేత్తలు ఓలేటి పార్వతీశం, పొత్తూరి సుబ్బారావు, ఎస్వీ. రామారావు, జి.వల్లీశ్వర్ కవి రమేశ్‌కు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

బహుమతి అందుకుంటున్న కవి కటుకోర్ముల రమేశ్

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

కూసుమంచి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అదే బ్యాచ్ కానిస్టేబుల్స్ చేయూత అందించారు. మండలంలోని రావిచెట్టు తండాకు చెందిన కానిస్టేబుల్ బానోతు కోటేశ్వరరావు (2003 బ్యాచ్) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని బ్యాచ్‌కు చెందిన సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు రూ.2.4 లక్షలు సమకూర్చి ఆదివారం మృతుని భార్య, కుమార్తెకు చెక్కు రూపంలో అందించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, తోటి సిబ్బంది ఎం.గజేంద్ర, బి.మల్లేష్, ఎం.శ్రీను, హరికృష్ణ, హుస్సేన్, విజయ్, రామయ్య, ఫకీరా తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు సతీమణి, కుమార్తెకు చెక్కు ఇస్తున్న కానిస్టేబుళ్లు

3న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో అక్టోబరు 3న ఖమ్మం పటేల్ స్టేడియంలో ట్రైయథ్లాన్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, షఫీ తెలిపారు. అండర్ 14, 16, 18, 20 వయసుల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రావాలని కోరారు.

అలరించిన బాలు యుగళ గీతాంజలి

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖమ్మం ఆధ్వర్యంలో ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బాలు యుగళ గీతాంజలి 'గువ్వా.. గోరింకతో..' కార్యక్రమం వీక్షకులను అలరించింది. తొలుత ప్రముఖ హాస్యనటుడు మొగిలి గుణకర్ ఆధ్వర్యంలో అతిథులు, నిర్వాహకులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చలనచిత్రాల్లో పాడిన అలనాటి మధుర గీతాలను ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం అతిథులు, గాయకులను నిర్వాహకులు శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మొగిలి గుణకర్, భక్తిగీతాల గాయకుడు నాగసాయి, గాయకులు ఎస్వీ.రమణ, ఆకుల గణపతిరాజు, ఆరేపల్లి పున్నయ్య, వీవీ.రెడ్డి, వంజా మాలతి, కీర్తన, స్వప్న, కీర్తి, రమేశ్‌బాబు, మురళీకృష్ణ, శ్రీలత, కావేరి తదితరులు పాల్గొన్నారు.

గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ఖమ్మం సర్వజనాసుపత్రిలో వాస్క్యులర్ కేంద్రం

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రిలో వాస్క్యులర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూత్రపిండాల వ్యాధిగ్రస్థుల కోసం రాష్ట్రంలో రెండు జిల్లాల్లో ఈ తరహా కేంద్రాలను నెలకొల్పేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఖమ్మం ఆస్పత్రి కూడా ఉండటంతో డయాలసిస్ రోగులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్పత్రిలో ప్రస్తుతం 22 పడకలతో కూడిన డయాలసిస్ కేంద్రం ఉంది. వాస్క్యులర్ కేంద్రం ఏర్పాటు నేపథ్యంలో రక్తశుద్ధి యంత్రాల సంఖ్య మరింత పెరగనుంది. డయాలసిస్ సందర్భంలో వాస్క్యులర్ కేంద్రం కీలకం. రక్తశుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు డయాలసిస్ యాక్సస్ పాయింట్ ఏర్పాటుకు వాస్క్యులర్ సర్జరీ చేస్తారు. ఇది రక్త ప్రవాహాన్ని నివారించడానికి ఉపయోగపడుతుంది. చికిత్స సమయంలో ద్రవం తొలగింపు, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌లో మార్పులకు ప్రతిస్పందనగా సర్దుబాటు చేస్తుంది. ఈ సర్జరీ కోసం రోగులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడే కేంద్రం ఏర్పాటైతే రానున్న కాలంలో బాధితులకు ఊరట లభిస్తుంది.

EENADU eClassifieds

BUSINESS SERVICES | JOBS

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోలసేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

REAL ESTATE

HOUSE FOR SALE

ఖమ్మం పట్టణంలో శాంతినగర్, మిషన్ హాస్పిటల్ ఎదురుగా 500 గజాల విస్తీర్ణంలో, 250 గజాల ఇల్లు, 250 గజాల ఖాళీ స్థలంతో అమ్మబడును. Cell No: 7981828101.

PLOT FOR SALE

ఖమ్మంలో DTCP & RERA అప్రూవల్స్‌తో క్షేత్ర ధర్మస్థలి, ప్రణామం, గోల్డెన్ నిటి, సీతారామం వెంచర్స్‌లో ప్లాట్స్ కలవు. A.నవీన్‌రెడ్డి, సెలఃన 9959872364.

దసరా ఆఫర్: ఫ్రీ రిజిస్ట్రేషన్, హైదరాబాద్‌లో HMDA & DTCP ప్రాజెక్ట్స్ అన్ని డెవలప్‌మెంట్స్, లోన్స్‌తో విజయవాడ, సాగర్, శ్రీశైలం హైవేలలో ప్లాట్లు. Ph: 9154102338

ఖమ్మంలోని కార్పొరేట్ ఆఫీస్ నందు ఆకౌంటెంట్స్-4, క్యాషియర్స్-2, రిసెప్షనిస్ట్-2 టెలికాలర్స్-5, Front Office-2, కలెక్షన్- 4, మార్కెటింగ్- 4 కావలెను. ఖమ్మం. సెలఃన 9490791669.

ఖమ్మం, వైరెండు 'X' రోడ్, సమత నర్సింగ్ హోమ్ హాస్పిటల్ నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. Pharma'D' పూర్తి అయినవారు కావలెను. సంప్ర (9 AM to 5 PM). Cell: 6309889361.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భోజనం Hyd. 9182260297.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు నగదుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మానవీయం

మాయదారి రోగం.. పేద బతుకు ఆగం

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే

దంపతులకు మూత్రపిండాల సమస్య
చదువులు మానేసి కూలీకెళ్తున్న కుమార్తెలు

అప్పటివరకు ఉన్నంతలో హాయిగా సాగిపోతున్న జీవితంలో ఒక్కసారిగా కుదుపు మొదలైంది. అది మొదలు దెబ్బమీద దెబ్బపడుతూ చివరకు ఇంటి పోషణే వారికి భారమైంది. కుటుంబ పెద్ద దిక్కు, అతని భార్య.. ఇద్దరూ అనారోగ్యం బారిన పడటంతో ఇప్పుడు వారి ఇద్దరి ఆడపిల్లలు చదువు మానేసి కూలీపనులకు వెళ్తున్నారు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని జల్లేపల్లికి చెందిన దార మల్సూరు, రమణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మల్సూరు ఆటో నడుపుతూ, రమణ ఇంట్లోనే టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. రెండేళ్ల క్రితం మల్సూరు తీవ్ర కడుపు నొప్పితో ఇబ్బంది పడుతుండగా అతణ్ని ఆసుపత్రిలో చేర్పించారు. కిడ్నీ పనిచేయటం లేదని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లోని పెద్దాసుపత్రులకు వెళ్లారు. దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. అతని రెండో కిడ్నీ కూడా పాడైపోవటంతో డయాలసిస్ తప్పనిసరి అయింది. ప్రారంభంలో హైదరాబాద్‌లో డయాలసిస్ చేయించుకున్న మల్సూరు ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఖర్చుల కోసం తన ఆటోను కూడా అమ్మేశాడు. భర్త పనిచేసే పరిస్థితి లేకపోవటంతో టైలరింగ్ చేసే రమణపై కుటుంబ భారం పడింది. 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు' కొన్ని నెలల క్రితం ఆమె కూడా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరారు. పరీక్షించిన వైద్యులు తనకూ ఓ కిడ్నీ పాడైపోయిందని, మందులు వాడాలని సూచించారు. ప్రైవేటు వైద్యం చేయించుకునే స్థోమత లేక భర్తతో కలిసి ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోనే చికిత్స పొందుతోంది. వైద్యుల సూచన మేరకు రమణ కుట్టు మిషన్ పని కూడా ఆపేసింది.

పూట గడిచే దారిలేక..

మల్సూరు దంపతుల పెద్ద కూతురు బీటెక్, చిన్న కూతురు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న క్రమంలో తల్లిదండ్రులిద్దరూ పనిచేసే పరిస్థితి లేకపోవటంతో ఈ ఏడాది జనవరిలో మధ్యలోనే చదువు మానేశారు. ఇల్లు గడిచేందుకు అక్కాచెల్లెలిద్దరూ ప్రస్తుతం కూలీ పనులకు వెళ్తున్నారు. మల్సూరు దంపతులకు మందులు, రానుపోను ఖర్చులకు రూ.2,500- 3వేలు ఖర్చవుతున్నాయి. కనీసం పింఛను వచ్చే అవకాశం లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, కుమార్తెల చదువులకు సహకారం అందించాలని దంపతులు కోరుతున్నారు. దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 9394450050

తన ఇద్దరు ఆ

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

'పూజారులకు దమ్మక్క పురస్కారాలు ఇవ్వాలి'

భద్రాచలం, న్యూస్‌టుడే: ఆదివాసీ మహిళ పోకల దమ్మక్క భద్రాచలంలో సీతారామ లక్ష్మణులను తొలి సారిగా గుర్తించడం వల్లనే ఈ క్షేత్రం దక్షిణ అయోధ్యగా పేరుగాంచిందని అఖిలభారత హనుమాన్ ప్రచారకులు గాదెపాక రాములుస్వామి అన్నారు. వరంగల్ జిల్లా ముద్దునూరుకు చెందిన ఆయన రెండు దశాబ్దాలుగా పాదరక్షలు ధరించకుండా ఆధ్యాత్మిక పర్యటనలు చేస్తూ రామయ్య సన్నిధికి రైల్వే లైను రావాలని పలుచోట్ల హోమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం భద్రాచలంలో గోదావరి మాతకు సారె, పూజాద్రవ్యాలను సమర్పించారు. దమ్మక్క పేరిట అర్చకులకు, పండితులకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాల్మీకి రామాయణంలో శబరిమాతకు ఎంతో విశిష్టత ఉందని, ఆమె పేరుతో జాతీయ స్థాయి ఉత్సవాలను నిర్వహించాలని, దళిత పూజారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు.

'కాంగ్రెస్ హామీలను అమలుచేయాలి'

గుండాల , న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. ఆదివారం గుండాలలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఎన్నికలముందు పలు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన అనంతరం స్వార్థ ప్రయోజనాలకోసం పాకులాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

నిర్మాణం పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయాలి: సీపీఎం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో అర్హులైన నిరుపేదలకు నిర్మాణం పూర్తయిన రెండు పడకగదుల ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కొర్రాజుల గుట్ట కేసీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన కుమురం భీం శాఖా మహాసభల్లో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ప్రసంగించారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుపేదలకు ఇళ్లు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం చేస్తోందని విమర్శించారు. ముందుగా అమరు వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బంగారు శరత్‌బాబు, రామారావు, కుంజా శ్రీను, మడెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అప్రమత్తతే.. అందరికీ రక్ష..!

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

దీపావళి పండుగకు విక్రయించే టపాసులను, వివిధ కార్యక్రమాలకు వినియోగించే బాణసంచా సామగ్రిని వ్యాపారులు అనుమతులు లేని గోదాములో అక్రమంగా నిల్వ చేస్తుండటంతో ముప్పు పొంచి ఉంది. రెండు రోజుల కిందట ఓ గోదాములో అక్రమంగా నిల్వచేస్తున్న సరకును అధికారులు పట్టుకున్న సంగతి తెలిసిందే. భద్రాచలం పట్టణంలో ఏటా దాదాపు రూ. 2 కోట్లకు పైగా విలువైన దీపావళి టపాసుల విక్రయాలు సాగుతాయి. విక్రయ దుకాణాలు స్థానిక గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేస్తారు. ఏటా సరకు విక్రయించగా మిగిలిన వాటిని అనుమతులు లేని ప్రాంతాల్లోనే నిల్వ చేస్తున్నారు.

టపాసుల పెట్టెలతో శనివారం పట్టుబడిన లారీ

కలెక్టర్‌కు పిర్యాదు..

బాణసంచా అక్రమ నిల్వలపై కొందరు ఇటీవీల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. టపాసులు నిల్వ చేసేందుకు పట్టణంలో ఇప్పటి వరకు ఒక్క గోదాముకూ అనుమతి పొందలేదు. శనివారం పట్టుకున్న టపాసులను సారపాక తరలించినట్లు భద్రాచలం తహసీల్దారు శ్రీనివాస్ తెలిపారు. అంటే రూ. కోట్లలో వ్యాపారం సాగుతున్నా కనీస ప్రమాణాలు పాటించడం లేదని, ఎక్కడబడితే అక్కడ వీటిని ఉంచుతున్నారన్నది తేటతెల్లమవుతోంది.

గత ఘటనలను గుర్తుంచుకుంటే మేలు..

ఏటా విక్రయాలు అనంతరం మిగిలిన సరకు నిల్వ ఉంచాలంటే రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అనుమతులతో నిర్దిత ప్రమాణాలను పాటించే గోదాముల ఏర్పాటు తప్పనిసరి. ఏలాంటి అనుమతుల లేకుండా సుమారు 20 ఏళ్ల కిందట ఐటీడీఏ రోడ్డులోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో టపాసులు నిల్వ ఉంచడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ముగ్గురు హమాలీలు దుర్మరణం పాలయ్యారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు దృష్టి సారించి ప్రత్యేక గోదాముల్లో వీటిని నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

✦ ప్రస్తుత పరిస్థితిపై స్థానిక అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పట్టణంలో ఎలాంటి అనుమతులు లేవని, టపాసులు అక్రమంగా నిల్వ ఉంచితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: అశ్వారావుపేట - గుర్రాలచెరువు మార్గంలో వైకుంఠధామం సమీపంలో ఓ ప్రైవేటు సంస్థ టెలిఫోను కేబుల్ వేసేందుకు రోడ్డుపక్కన తవ్వారు. కేబుల్ వేశారు. గోతులు సక్రమంగా పూడ్చకపోవడంతో అస్తవ్యస్తంగా తయారై రాకపోకలు నానా ఇబ్బందిగా ఉంది. **- వి.సత్యనారాయణ, గుర్రాలచెరువు రోడ్డు, అశ్వారావుపేట**

సమాధానం: మాకు తెలపకుండానే టెలిఫోను కేబుల్‌ను ఓ ప్రైవేటు సంస్థ వారు వేశారు. భారీ వర్షాలు, వరదలకు రోడ్డు కోతకు గురై మట్టి కొట్టుకుపోయి ఆ మార్గం అస్తవ్యస్తంగా తయారైంది. వారంలో సరిచేయిస్తాము. **- కె.శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి, అశ్వారావుపేట – అశ్వారావుపేట, న్యూస్‌టుడే**

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: గోవిందాపురం, పెదబండిరేవు, అచ్చుతాపురం, నడికుడి, కాటాయిగూడెం తదితర గ్రామాల్లో తాలిపేరు కాలువలో గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు పెరిగి రైతుల పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందని దుస్థితి. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమవడంతో నీటిపారుదల శాఖ ఏఈ రాజ్‌సుహాస్ స్పందించారు. గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు తొలగింపు చర్యలు చేపట్టి పనులు చేయిస్తున్నారు.

స్పందనకు పండగం

రాములవారి బంగారు ఆభరణాల పరిశీలన

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలోని బంగారు, వెండి ఆభరణాల పరిశీలన కొనసాగుతోంది. ఈఓ రమాదేవి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ఆదివారం మరోసారి వీటి లెక్కలను పరిశీలించారు. త్వరలో వీటి పూర్తి బాధ్యతను ఈఓ తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో నగల తూకాలతో పాటు వాటి సంఖ్యను కచ్చితంగా గుర్తించాలని నిర్ణయించారు. బంగారం తూకంపై సందేహాలు లేనప్పటికీ వెండి విషయంలో కొంత గందరగోళం ఉంది. వీటిపై స్పష్టత వచ్చిన తర్వాత అధికారికంగా ఈ వివరాలను వెల్లడించే వీలుంది.

విద్యుత్తు మీటర్లకు దరఖాస్తు చేసుకోండి

అశ్వాపురం, న్యూస్‌టుడే: పేదలకు రూ.998కే బీపీఎల్ విద్యుత్ మీటరుకు దరఖాస్తుల గడువు సోమవారంతో ముగుస్తుందని, దరఖాస్తులు చేసుకోనివారు ఎవరైనా ఉంటే వెంటనే చేసుకోవాలని విద్యుత్ శాఖ మండల ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లిలోని శ్రీఉమాపృథ్వీ రామలింగేశ్వరస్వామి ఆలయ నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికలను ములకలపల్లి ఎస్సై రాజశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ అక్టోబరు 3 నుంచి 12 వరకు నిర్వహించనున్న దసరా నవరాత్రి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు ఠాణాల నిర్మాణానికి నిధులు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు, పినపాక మండలాల్లో అసంపూర్తిగా ఉన్న పోలీస్ ఠాణాలను పూర్తిస్థాయిలో నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించగా వెంటనే స్పందించిన ఆయన రెండు భవనాల నిర్మాణానికి రూ. 1.50కోట్ల నిధులను మంజూరు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు సీఎంకు పాయం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అయ్యప్ప ధర్మ ప్రచార కమిటీ ఎన్నిక

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని శ్రీ పంచముఖ వేదగాయత్రి మాత ఆలయంలో ఆదివారం అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిటీ జాతీయ కార్యదర్శి తిరుమలరావు మాట్లాడుతూ నవంబర్ 15 నుంచి 2025 జనవరి 15 వరకు అయ్యప్ప దీక్షా సమయంగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకట్రావు, సత్యనారాయణలతో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లంరాజు, సభ్యులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, ఏడుకొండలు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

గుండాల, న్యూస్‌టుడే: గుండాల పీఏసీఎస్‌లో పనిచేస్తున్న సీఈఓ రాంబాబు, చైర్మన్ రామయ్య ఆదివారం ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. సెంట్రల్ బ్యాంకు చైర్మన్ డి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఖమ్మంలో అవార్డును అందుకున్నారు.

కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: చట్టబద్ధతలేని పనులను ప్రోత్సహిస్తూ సింగరేణి కార్మికులను మానసిక ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తెబొగకాసం బ్రాంచి ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ అన్నారు. మణుగూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు ఓసీ-2 గనిలో ఎటువంటి చట్టబద్ధత లేకుండా భోజన సమయాన్ని కొనసాగించడం సరికాదన్నారు. అధికారులు స్పందించాలన్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారణమైన పోలీసులను అరెస్టు చేయాలి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసుస్టేషన్ ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యకు కారణమైన ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, ఇతర కానిస్టేబుళ్లను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం తక్షణమే అరెస్టు చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి' జాతీయ కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు గురిమిళ్ల రాజు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నేత గడ్డం సదానందం, గాయకుడు మచ్చ దేవేందర్, సావిత్రీబాయి పులే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.సరోజన, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఇంద్రవెల్లి రమేశ్ మాట్లాడారు. ఎస్సై మరణ వాంగ్మూలాన్ని కూడా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎస్సై భార్యకు గ్రూప్-1 ఉద్యోగంతో పాటు ఆయన కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సై సతీమణి కృష్ణవేణి, సోదరి శంకరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

జూద స్థావరాలపై పోలీసులు దాడి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మామిళ్లవారిగూడెంలో నిర్వహిస్తున్న జూదస్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని రంగాపురం శివారులో జూద స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఒకరిని అదులోకి తీసుకోగా, నలుగురు పరారయ్యారు. రూ.2వేలు స్వాధీనం చేసుకొని, ఐదుగురిపై కేసు నమోదు చేసి, ధర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

'ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేశం, రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థిక అసమానతల కారణంగా ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బ్రహ్మచారి పేర్కొన్నారు. మణుగూరులో ఆదివారం నిర్వహించిన సీపీఎం హమాలీ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉండటంతో ప్రజలకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వ శాఖలు కార్పొరేట్ శక్తుల ఆధీనంలో కొనసాగుతున్నాయన్నారు. అనంతరం హమాలీ శాఖ నూతన కార్యదర్శిగా శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, రాములు, దామల్ల లెనిన్‌బాబు, సాంబశివరావు, నర్సింహారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బ్రహ్మచారి

వానొస్తే.. అవస్థలే..!

దుమ్ముగూడెం మండలం ములకపాడు క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రహదారి గోతులమయంగా తయారైంది. పల్లపు ప్రాంతం కావడంతో వర్షం నీరు నిల్వ చేరుతోంది. అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారేగాని శాశ్వత పరిష్కారం దిశగా దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ర.భ.శాఖ డీఈ హరిలాల్‌ను మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోడ్డు ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని వివరించారు. **– దుమ్ముగూడెం, న్యూస్‌టుడే**



మట్టి రోడ్డు కాదు.. బీటీ రహదారే..!

బండరాళ్ల తేలి, బురదమయంగా ఉన్న ఈ చిత్రంలోని కనిపిస్తున్న రోడ్డు ఏ కొండ ప్రాంతంలోదో కాదండోయ్..! ములకలపల్లి మండలం కొత్తూరు శివారులోని బీటీ రోడ్డు దుస్థితి ఇది.. సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా సుమారు ఐదేళ్ల కిందట పూసుగూడెం- దంతెలబోరు ప్రధాన రహదారిని తొలగించి కాలువ తవ్వారు. అనంతరం వంతెన నిర్మించి రాకపోకలను పునరుద్ధరించారు. ఇంత వరకు భాగానే ఉన్నా వంతెనకు అనసందాన రోడ్డును అలాగే వదిలేశారు. అక్కడ బండ రాళ్లు పైకితేలి ఇలా ప్రమాదకర పరిస్థితి ఉంది. పీఆర్ ఏఈ సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వంతెనకు ఇరువైపుల నీటిపారుదల శాఖ అధికారులే రహదారి అనుసంధాన పనులు చేయాల్సి ఉందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. **– ములకలపల్లి, న్యూస్‌టుడే**



కారులో తరలిస్తున్న గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఆబ్కారీ సిబ్బంది పట్టణ శివారులో వాహన తనిఖీలు చేసి కారులో తరలిస్తున్న 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఒడిశా మల్కానగిరికి చెందిన దేవ్ కుమార్ రాయ్, దీపక్ రాయ్‌గా గుర్తించారు. ఒడిశా నుంచి బెంగళూరుకు కారులో గంజాయిని వీరు తరలిస్తున్నారని, దీని విలువ రూ. 5 లక్షల విలువ ఉంటుందని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. గంజాయి, కారుతోపాటు రెండు చరవాణులను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు భద్రాచలం ఆబ్కారీ సీఐ రహిమున్నీసా బేగం పేర్కొన్నారు.

16 కిలోల గంజాయి..

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను మణుగూరు సమీపంలో ఆదివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్థానిక రథంగుట్ట అర్బన్ పార్కు సమీపంలో తనిఖీలు చేపట్టారు. మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. వారి నుంచి రూ. 4 లక్షల విలువైన 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో జగిత్యాలకు చెందిన అరవింద్, లక్ష్మణ్, సూర్యాపేటకు చెందిన గోపి, రమేష్, టేకులపల్లికి చెందిన సాయికుమార్, నవీన్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి చరవాణులతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి'

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కష్టపడి కాదు.. ఇష్టపడి చదివితేనే ఏర్పరచుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని పెద్దవాగు ప్రాజెక్టు గ్రామంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్పందన పేర్కొన్నారు. ఆదివారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకునే వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాక్షించారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

సాంస్కృతిక ప్రదర్శనలో మహిజా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

'ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి'

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పూల రవీందర్ అన్నారు. ఆదివారం ఆళ్లపల్లిలో ఆ సంఘం నాయకులతో సమావేశమయ్యారు. మాల కులస్థులందరూ ఏకతాటిపైకొచ్చి పోరాడాలని పేర్కొన్నారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడిగా కరకపల్లి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా వేమూరి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిట్ట నవీన్, దీలీప్, దాసు, శ్రీనివాస్, స్టాలిన్, జీవన్, ప్రవీణ్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పోరాట సంఘం నాయకులు, కార్యకర్తలు

క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వండి

దమ్మపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. మండలంలోని పాత్రెకలగండి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దమ్మపేట జోన్‌స్థాయి ఆశ్రమ పాఠశాలల క్రీడా పోటీలను ఐటీడీఏ డీడీ మణెమ్మతో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థినులకు వాలీబాల్, కోకో, కబడ్డీ, అథెట్లిక్స్ విభాగాల్లో పోటీలు సాగాయి. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన 130 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలు నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని క్రీడల కన్వీనర్ రవికుమార్ తెలిపారు. పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డీడీ మణెమ్మ, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన వనమా గాంధీ

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ని అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వనమా గాంధీ ఆదివారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయనతోపాటు మారగాని శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

పుస్తక సమీక్షలో సాయికుమారాచార్యులకు బహుమతి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఉరిమళ్ల ఫౌండేషన్, ఖమ్మం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్ష పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన సిద్ధాంపు సాయికుమారాచార్యులు ప్రత్యేక బహుమతి అందుకున్నారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ బహుమతిని ఉరిమళ్ల సునంద నుంచి ఆయన అందుకున్నారు. ఈనేపథ్యంలో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

అశ్వారావుపేట ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా వలీపాషా

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట మండల ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా షేక్ వలీపాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అశ్వారావుపేట పురాతన మసీదులో నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌రెహమాన్(బాబా), ఉపాధ్యక్షుడిగా షేక్ సర్దార్, కార్యదర్శిగా ఎండీ నజీర్ అహ్మద్, కోశాధికారిగా ఎండీ జాన్‌పాషా, సంయుక్త కార్యదర్శులుగా రెహమత్, యాకూబ్‌తో పాటు మరో 15మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

పటాలెక్కిన పర్ణశాల అభివృద్ధి

భద్రాచలం, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగని దుస్థితి. ఎట్టకేలకు ఆ పనులు ప్రస్తుతం మొదలవడంతో ఆలయ అభివృద్ధిపై అడుగు ముందుకు పడింది. భద్రాచలం పుణ్యక్షేత్రానికి కేవలం 35 కిలోమీటర్ల దూరంలో అనుబంధంగా ఉన్న పర్ణశాల రామాలయం అభివృద్ధిలో భాగంగా 2022లో తెలంగాణ పర్యాటక శాఖ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 2023లో ప్రసాద్ పథకం కింద సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులకు 2024లో అధికారులు శంకుస్థాపన చేశారు. అనంతరం పలు కారణాలతో పనులు నిలిచిపోయాయి.

భక్తులను ఆకర్షించేలా..

పర్ణశాల పుణ్యక్షేత్రాన్ని భక్తులు, యాత్రికులను ఆకర్షించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సదుద్దేశంతో ప్రసాద్ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. భక్తులకు, యాత్రికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి రామాలయం పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టి సుందరీకరణ చేయనున్నారు. సమాచార కేంద్రం, గ్రంథాలయం, సామాన్ల భద్రపరిచే వసతి, సీసీ కెమెరాల ఏర్పాటు, దుకాణాల సముదాయం, సీతవాగు వద్ద కాలినడక వంతెన, 5 బయో మరుగుదొడ్లు, రెయిన్ షెల్టర్, విద్యుదీకరణ వంటి అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉంది. అభివృద్ధి పనులకు మే నెలలో రామాలయం

నిర్మాణ పనుల కోసం తీసిన పునాది

ఆవరణలో పునాదులు తీశారు. అయితే అక్కడి స్థలం వీటి నిర్మాణానికి అనుకూలంగా లేకపోవడం, సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికీ ఈ పనులు అడ్డంకిగా ఉండటంతో కొద్ది రోజుల తర్వాత నిలిపివేశారు. అనంతరం హైస్కూల్ వెనక భాగంలో స్థలం సేకరించారు. గుత్తేదారులు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పునాదులు తీసిన తర్వాత ఎడతెరిపి లేని వర్షాలతో ఆ గోతుల్లోకి నీరు చేరి ఆటంకం కలిగింది. ప్రస్తుతం వరదల తాకిడి తగ్గడంతో పనులను తిరిగి ప్రారంభించారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం – జి.ప్రసాద్, పర్యాటక శాఖ ఏఈ

గోదావరి వరదల కారణంగా పనులు చేసేందుకు వీలు కుదరకపోవడంతో కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం మళ్లీ ప్రారంభించాము. 2024 డిసెంబరు నాటికి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రామాలయం పనులు పూర్తి చేస్తాం.

చారిత్రక కట్టడం.. నేటికీ ప్రయోజనకరం..!

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి ప్రాంతంలో గోదావరి నది వద్ద బ్రిటీషు కాలంలో నిర్మించిన ఆనకట్ట చారిత్రక కట్టడంగా నేటికీ బహుళ ప్రయోజనకారిగా నిలుస్తోంది. నేటికీ చెక్కుచెదరకుండా దర్శనమిస్తోంది. రాజమండ్రి నుంచి దుమ్ముగూడెం వరకు వ్యాపారాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో నాటి బ్రిటీషు ప్రభుత్వం కాటన్‌దొర హయాంలో సుమారు 1864లో ఈ ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హెక్ అనే ఇంజినీరు ఆనకట్టకు

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

క్రియాశీలక కార్యకర్తలకు కమిటీలో ప్రాధాన్యం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మాల మహానాడులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న కార్యకర్తలకు పట్టణ కమిటీలో ప్రాధాన్య కల్పిస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర సెక్రటరీ జనరల్ మధుసూదన్‌రావు అన్నారు. పట్టణ కమిటీల నియామకంతో పాటు జిల్లా కమిటీ విస్తరణ చేపడుతూ ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా శనగ ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా పోచంపల్లి సురేశ్‌తో పాటు మరో నలుగురిని, జిల్లా కమిటీలో ఉపాధ్యక్షులుగా శనగ పుల్లయ్యలను ఎన్నిక చేశారు.

పట్టణ కమిటీ నాయకులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న మధుసూదన్‌రావు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం నార్త్ సెక్షన్ పరిధిలో భజన మందిర్ సబ్ స్టేషన్ 33/11కె.వి. విద్యుత్ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నర్మద ఆదివారం ఒక ప్రకటనలలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కూలీలైన్, ఎంజీ రోడ్, పెద్దబజార్, చిన్నబజార్, నేతాజీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

భవిష్యత్ తరాలకు ఆదర్శనీయుడు రామలక్ష్మణ్

గుడివాడ రామలక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నేత నాగ సీతారాములు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీలో విశేష సేవలందించిన గుడివాడ రామలక్ష్మణ్ భవిష్యత్ తరాలకు ఆదర్శనీయుడని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అభిప్రాయపడ్డారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రామలక్ష్మణ్ సంస్మరణ సభకు ఆయన హాజరయ్యారు. టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములుతో కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నాయకులు జేబీ శౌరి, ఏనుగుల అర్జున్‌రావు, డీసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు ఎండీ కరీంపాషా, మాజీ జడ్పీటీసీ గిడ్డ పరంజ్యోతిరావు, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ స్వచ్ఛతా హీ సేవా 2024లో భాగంగా నేడు(సోమవారం) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని డీఆర్డీఓ విద్యాచందన అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెప్మా, ఐసీడీఎస్, సెర్ప్, ఐడీఓసీల సిబ్బందికి ఉదయం 9.30 నుంచి డీఆర్డీఓ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు.

ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్'

ముంచుపల్లి, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ మాట్లాడిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని అదివారం భాజపా నాయకులు నరేంద్రబాబు, రాయుడు నాగేశ్వరరావు, రమణగౌడ్ తదితరులు అశోక్‌నగర్‌లో టీవీలో వీక్షించారు. కొత్తగూడెంకు చెందిన సింగరేణి కార్మికుడు మొక్కుల రాజశేఖర్ మొక్కుల పెంపకంతో పాటు ఇంటింటికి మొక్కులు పంపిణీ చేస్తున్న విషయాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు. రాజశేఖర్‌ను ప్రశంసించారు.

30 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వవిద్యార్థులు 30 ఏళ్ల తర్వాత తిరిగి అదే కళాశాలలో ఒకే వేదికపై ఆదివారం మరోసారి కలుసుకున్నారు. జూనియర్ కళాశాలలో 1992-94 సంవత్సరంలో అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత పూర్వ గురువులు అర్థశాస్త్ర, కామర్స్ అధ్యాపకులు పరుచూరి వెంకటరావు, హరి మధుసూదన్‌రావు, ప్రస్తుత కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేశ్‌ను సత్కరించారు.

పరిహారం.. ఇంకెన్నాళ్లో పరిహాసం

బేకులపల్లి, న్యూస్‌టుడే

కోయగూడెం ఉపరితల గనిలో భూములు కోల్పోయిన వారిలో కొందరు నిర్వాసితులకు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదు. దీంతో వారు గత ఏడేళ్లుగా కలెక్టర్ కార్యాలయం, ఏటీడీఏ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 'మా భూముల్లో బొగ్గు గని ఏర్పాటుతో రూ.కోట్లు గడిస్తున్న సింగరేణి యాజమాన్యం హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తేనే న్యాయం జరుగుతుంది' అని బాధితులు వాపోతున్నారు.

మండలంలోని కోయగూడెం ఉపరితల గని పిట్-1 కోసం కిష్టారం, లచ్చగూడెం, రోడ్డు గుంపు గ్రామాలకు చెందిన గిరిజన నిర్వాసితుల భూములను సింగరేణి సేకరించింది. మొత్తం 250 మంది పోడు రైతులకు చెందిన 231.84 హెక్టార్ల అటవీ భూమి, 165 మంది రైతులు సాగుచేస్తున్న మరో 349.27 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ పట్టాల భూములను యాజమాన్యం తీసుకుంది. ఏడేళ్ల క్రితం ఎకరాకు రూ. 5.25 లక్షల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ. 5.50 లక్షల చొప్పున అందజేశారు. కానీ, కొన్ని కారణాలతో కొందరు నిర్వాసితులకు ఏ పరిహారం అందలేదు. వీరిలో 11 మంది అర్హులు హైకోర్టును ఆశ్రయించగా.. యాజమాన్యం పరిహారం చెల్లించాలని గతంలో తీర్పు ఇచ్చింది. వీటి అమలులో జాప్యం జరుగుతుండటంతో నిర్వాసితులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కిష్టారం గ్రామానికి చెందిన జోగా దశరథ్, జబ్బా నర్సయ్య, జబ్బా ప్రియాంక, గుమ్మడి సమ్మక్క, జబ్బా ప్రసాదరావు, ఇర్ప నాగార్జున, వేప నాగరాజు, జబ్బా కృష్ణయ్య, జబ్బా కృష్ణవరప్రసాద్, వేప సమ్మయ్య, జబ్బా కన్నయ్యలకు పరిహారం దక్కాల్సి ఉంది. సింగరేణి డబ్బులు జమ చేయడంలో జాప్యం జరుగుతోందని భూ నిర్వాసితుల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, సింగరేణి అధికారులు నిర్లక్ష్యం వీడి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

నష్టపరిహారం చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట కిష్టారం నిర్వాసితుల ధర్నా(పాతచిత్రం)

★ 'సాధ్యమైనంత త్వరగా నిర్వాసితులకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేస్తాం. ప్రక్రియ కొనసాగుతోంది' అని కొత్తగూడెం ఆర్డీవో మధు 'న్యూస్‌టుడే'తో అన్నారు.

ఖమ్మంలో సీపీఐ జాతీయ మహాసభలు: కూనంనేని

ఇల్లెందు గ్రామీణం, చుంచుపల్లి, న్యూస్‌టుడే: అఖిల భారత కమ్యూనిస్టు మహాసభలను ఈసారి ఖమ్మంలో నిర్వహించేలా ప్రణాళిక చేస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని తెలిపారు. ఇల్లెందులో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాతో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీలో చేరిన మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బాస శ్రీనివాస్, రెంటాల సదానందం, కేపీసీ మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. చుంచుపల్లిలో సీపీఐలో చేరిన వారికి కండువా కప్పారు.

మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ప్రభుత్వ ధరలకే భూములు కేటాయించాలి

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ ధరలకే ప్రభుత్వ ఉపాధ్యాయులకు భూములు కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. కొత్తగూడెం పట్టణంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పలు సమస్యల సాధనకు భారీ ప్రదర్శన చేపట్టారు. ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష

బేకులపల్లి, న్యూస్‌టుడే: కేఓసీ నుంచి బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యం మేరకు చేపట్టాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ కేఓసీ అధికారులు, స్టాక్ హోల్డర్స్‌కు సూచించారు. ఓసీలో ఉత్పత్తిపై సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఏజీఎం(ఈఈ) గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, పీవో శ్రీనివాసరావు, మేనేజర్ సౌరభ్‌సుమన్ పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రిని పట్టించుకోండి

కొత్తగూడెం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా సర్వజన ఆసుపత్రిని పట్టించుకొని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.కామేశ్ కోరారు. ఆసుపత్రిలో డ్రైనేజీ మురుగునీటి కారణంగా కలుషితంగా, అపరిశుభ్రంగా మారుతున్న వైనాన్ని ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పరిశీలించారు. సాయి, రవికుమార్, వినయ్ పాల్గొన్నారు.

ఏఈవోల జిల్లా సంఘం ఎన్నిక

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సమావేశం ఆదివారం కొత్తగూడెంలో నిర్వహించినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి.నరసింహారావు, ఉపాధ్యక్షులుగా సందీప్, రమేష్, విజయ్, సాహిత్య, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, అనూషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

'మోదీపై తప్పుడు ప్రచారం మానుకోవాలి'

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి ఇంటిపై, ఆయన కుటుంబ సభ్యులు, వ్యాపార సంస్థలపై ఈడీ దాడులు చేస్తుంటే మోదీ చేయిస్తున్నాని కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని భాజపా నాయకుడు పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పాల్వంచలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో గాంధీ, శ్రీధర్, బాలాజీ పాల్గొన్నారు.

చర్చి వార్షికోత్సవం

బేకులపల్లి, న్యూస్‌టుడే: సులానగర్‌లోని ఆర్‌సీఎం పెద్ద చర్చి వార్షికోత్సవాన్ని అగస్టీన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కోయగూడెం, మాలపల్లి, ముత్యాలంపాడుక్రాస్‌రోడ్, బేకులపల్లి నుంచి క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్లు కొమ్ము ఆంథోని, సుధాకర్, జయరాజు హాజరయ్యారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

బేకులపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం కోయగూడెం గ్రామశాఖ సమావేశం ఆదివారం జరిగింది.

పేద కుటుంబాలకు చేయూత

పాల్వంచ, న్యూస్‌టుడే: భారీ వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఒడ్డుగూడెం కాలనీవాసులకు జనహిత ఫౌండేషన్ చేయూత కల్పించింది. పట్టణంలోని ఒడ్డుగూడెంకాలనీకి చెందిన సలీమ, నాగమణి గృహాలు కూలిపోయాయి. ఆయా కుటుంబాలకు 50 కిలోల బియ్యంతోపాటు రూ.6 వేల నగదు అందజేశారు. ఫౌండేషన్ నాయకురాలు బేరా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించినందుకు దాడి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: అకారణంగా తనను ఎందుకు తిడుతున్నారంటూ అడిగినందుకు ఓ మహిళపై దాడికి పాల్పడ్డ ఘటన జూలూరుపాడు న్యాకాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెంది పప్పుల రాణి ఆదివారం వీధిలో వెళ్తుండగా అదే కాలనీకి చెందిన కాశిమల్ల ప్రసన్న కుమార్, అతని కుటుంబ సభ్యులు దుర్భాషలాడారు. ఎందుకు తిడుతున్నారంటూ ప్రశ్నించడంతో రాణిపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలిని కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది

బుగ్గవాగులో వ్యర్థాల తొలగింపు



ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల స్టేషన్‌బస్తీ వరద ముంపునకు గురైన నేపథ్యంలో బుగ్గవాగులోని వ్యర్థాలను పురపాలక యంత్రాంగం ఆధ్వర్యంలో యంత్రాల సాయంతో ఆదివారం తొలగించారు. వాగును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

★ ముంపు సమస్య పరిష్కారానికి కరకట్ట నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన పార్టీ మహాసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భారీ వాహనం.. ఎగిసే దుమ్ము!

రద్దీ ప్రాంతం మీదుగా 22 టైర్లతో.. భారీ గ్రానైట్ రాళ్లను తీసుకెళ్తున్న లారీలతో దుమ్ము, ధూళి ఎగిసి వాహనదారులపై పడుతోంది. భారీ వాహనాల వేగాన్ని నియంత్రించడంతో పాటు.. కళ్లల్లో దుమ్ము పడకుండా రహదారులను శుభ్రం చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద భారీ రాళ్లతో వెళ్తున్న వాహనమిది..

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

బొగ్గు టిప్పర్ వద్ద ఎగిసిన దుమ్ము

బండలను మోసుకెళ్తున్న లారీ

నామినేటెడ్ పదవుల్లో లంబాడీలకు ప్రాధాన్యమివ్వాలి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో లంబాడీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని లంబాడీ ఐక్య వేదిక(ఐకాస) నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటైన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. కొత్తగూడెం మార్కెట్ కమిటీ ఛైర్మన్(ఏఎంసీ) ఛైర్మన్ పదవిని లంబాడీలకు కేటాయించాలని కోరారు. సమావేశంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌నాయక్, ఏజెన్సీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బానోతు లాల్‌సింగ్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు దారావత్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య లభావాదం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

వివాహితపై గుర్తు తెలియని వ్యక్తి దాడి

భర్త, అత్తే కారణమంటూ ఫిర్యాదు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: వివాహితపై గుర్తు తెలియని వ్యక్తి మారణాయుధంతో దాడికి పాల్పడిన ఘటన మాచినేని పేటతండాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. మాచినేనిపేటతండాకు చెందిన బానోత్ భద్రం భార్య నందిని తన నెలల శిశువుతో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అగంతకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి సుత్తి తీసుకుని యువతిపై దాడికి పాల్పడ్డాడు. తలపై మోదడంతో స్పృహతప్పి పడిపోయింది. చనిపోయిందని భావించిన వ్యక్తి అక్కడ నుంచి పారిపోయాడు. నందిని ఘటన నుంచి తేరుకుని కేకలు వేస్తూ బయటకు వచ్చి పడిపోయింది. చుట్టుపక్కల వారు చూసి ఆమెను ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన నందిని

వివాహేతర సంబంధం పెట్టుకుని.. నందినికి భద్రంతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. పెళ్లయినప్పటి నుంచి భర్త చిత్రహింసలు పెడుతున్నా ఓర్చుకుంటూ అతనితో కాపురం చేస్తోంది. ఈ క్రమంలో మణుగూరుకు చెందిన ఓ యువతితో వివాహేతర సంబంధం నెరపుతున్న భద్రం, ఆమెను కూడా ఇంటికి తీసుకొచ్చాడు. అత్త సరోజ సైతం కొడుకు పక్షానే ఉంటూ ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని నందినిని బెదిరిస్తుండేది. బంధువుల ఇంటికి వెళ్తున్నామని ఇంట్లో ఉంటున్న యువతితో చెప్పి నందిని భర్త, అత్త వెళ్లిపోయారు. కొద్దిసేపటి తరువాత యువతి కూడా కొత్తగూడెంలో ఓ వస్త్ర దుకాణంలో పనిచేసేందుకు వెళ్లింది. ఆ తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తి నందినిపై దాడికి పాల్పడ్డాడు. పథకం ప్రకారమే దాడి జరిగిందని, బాధితురాలు ఆరోపిస్తున్నారు. తనపై దాడికి పాల్పడ్డ వ్యక్తితోపాటు, భర్త, అత్త, ఇంట్లో ఉంటున్న మరో యువతిపై బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు.

కులవ్యవస్థ నిర్మూలనకు పోరాడదాం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కులవ్యవస్థ నిర్మూలనకోసం రాజీలేని పోరాటాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అన్నారు. కుల నిర్మూలనపై ఆదివారం ఇప్టూ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పెద్దబోయిన సలీష్ అధ్యక్షత వహించిన సదస్సులో మాచర్ల సత్యం, ధర్మా, మధుసూదన్, యాకూబ్‌షావలి, వై.గోపాలరావు, రమేష్, మల్సూర్, సుందర్, చంద్రశేఖర్, నాగమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముద్దా భిక్షం

జిల్లా స్థాయి క్రీడలకు జట్ల ఎంపిక

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పాల్వంచ డివిజన్ స్థాయి గిరిజన క్రీడా జట్ల ఎంపికలు కిన్నెరసానిలోని ప్రభుత్వ గిరిజన మోడల్ క్రీడా పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఏటీడీఓ చంద్ర మోహన్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. అండర్-17 బాలికలకు 800 మీటర్ల పరుగు పందెం, బాలబాలికలకు జూనియర్, సీనియర్ విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ నిర్వహించారు. డివిజన్ పరిధిలో 102 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. పాఠశాల హెచ్.ఎం. ఎల్.రామారావు, ఏఎస్‌వో వెంకటనారాయణ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో పునర్నిర్మాణం చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును జీఎం జాన్ ఆనంద్ ఆదివారం ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ.. మైదానంలో సెంట్రల్ లైటింగ్, వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, జీవి మోహన్‌రావు, రవికుమార్, శివప్రసాద్, నాగరాజు, బాలాజీ పాల్గొన్నారు.

జోనల్ పోటీల సందడి

ఇల్లెందు గ్రామీణం: ఇల్లెందు పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల జోనల్ క్రీడా పోటీలను బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పోటీలను ఏటీడీవో సూర్నపాక రాధమ్మ, ప్రధానోపాధ్యాయులు, పీడీ, పీఈటీలతో కలిసి ప్రారంభించారు. ఆరు పాఠశాలలకు చెందిన 226 మంది క్రీడాకారిణులు అండర్ 14, 17 విభాగాల్లో.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ.. రక్షణ!

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

కల్లుగీత కార్మికులు తాటి చెట్లు ఎక్కే క్రమంలో తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. కొందరు ఎంతో ఎత్తు నుంచి జారిపడటంతో చనిపోవడమో, అచేతనులై మంచానికే పరిమితం కావడమో జరుగుతోంది. ఈ క్రమంలో గీత వృత్తిదారుల రక్షణకు ప్రభుత్వం 'కాటమయ్య రక్షణ కిట్'లను అందజేస్తోంది. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో 1992 వరకు గీత కార్మికుల సొసైటీ కొనసాగింది. పట్టణంతో పాటు మండలం పరిధిలో ముకుందాపురం, ధర్మాపురం, బొజ్జాయిగూడెం, రొంపేడు, రాగబోయినగూడెం, సుదిమళ్ల గ్రామాల్లో 240 కుటుంబాలున్నాయి. వీరికి రక్షణ కిట్‌లు మంజూరు చేస్తున్నట్లు టీసీ శాఖ చెబుతోంది.

కాటమయ్య కిట్ పరికరాలపై ఇస్తున్న శిక్షణ

★ కిట్‌లో మొత్తం ఆరు పరికరాలుంటాయి. వీటి సాయంతో సులువుగా తాటి చెట్లు ఎక్కొచ్చు. గతంలో కాలు జారడమో, గాలి దుమారం వల్ల ప్రమాదవశాత్తు అంతెత్తు నుంచి కిందపడేవారు. ఈ కిట్‌ను ధరించినవారు ఎట్టి పరిస్థితుల్లో పడిపోరు. తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్, లెగ్‌లూప్ వంటివి కిందపడిపోకుండా చెట్టును అట్టిపెట్టుకుని ఉండేలా చూస్తాయి. అత్యంత రక్షణతో, అత్యాధునిక సాంకేతికతతో దీన్ని తయారు చేశారు.

ఆసక్తి ఉన్నవారికి..

'ఇల్లెందు సొసైటీ పరిధిలో లైసెన్సు కలిగిన గీతకార్మికులు 14 మంది ఉన్నారు. వారితో పాటు 18 ఏళ్లు నిండిన వృత్తిదారులెవరికి ఆసక్తి ఉన్నా కిట్‌ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి నిబంధనల ప్రకారం కాటమయ్య కిట్లను అందిస్తాం' అని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇందిర తెలిపారు.

గుడిసె దగ్ధం.. రోడ్డునపడిన కుటుంబం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదంతో ఓ కుటుంబం రోడ్డున పడింది. నెహ్రూనగర్‌కు చెందిన రైతు దారావత్ లచ్చు కొద్దిపాటి భూమి సాగు చేసుకుంటూ గుడిసెలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం వ్యవసాయ పనులు చూసుకుని వస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి ముందు కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో క్షణాల్లో మంటలు చెలరేగడంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక వాహనం వచ్చేలోగా తీరని నష్టం జరిగింది. వ్యవసాయ పనులకు బీరువాలో దాచిన రూ.20 వేల నగదు, సామగ్రి, దుస్తులు బూడిదయ్యాయని లచ